క్లుప్తంగా

మండలంలో 354 కొత్త పింఛన్లు

గంగాధరనెల్లూరు: మండలంలో నూతనంగా 354 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ఇందులో 109 మంది వితంతువులకు, ముగ్గురు ఒంటరి మహిళలకు, 146 మందికి వృద్ధులకు, 85మందికి దివ్యాంగులకు, 11మంది డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో శనివారం 2023 సంవత్సరం యూటీఎఫ్ క్యాలెండర్లు, డెయిరీలను ఎంఈవో రాజేంద్రన్ ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కావాల్సిన అన్ని అంశాలు క్యాలెండర్లు, డెయిరీల్లో పొందుపరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేంద్రన్, నాగరాజనాయుడు, సుబ్బరాయపిళ్లై, కేశవన్, భానుప్రకాష్, మునికృష్ణ, శైలజ, బాబూజీ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో సంఘాల సేవలు మరువలేనివని ఎంఈవో విజయకుమార్ అన్నారు. ఎమ్మార్సీ భవనం వద్ద శనివారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్టీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయవాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నాగేంద్రరాజు, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

పాలసముద్రం : మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఉన్న గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఈఈ శంకరప్ప తెలిపారు. ఆయన శనివారం గొల్లకండ్రిగ జగనన్న లేవుట్‌లో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులకు అవసరమైతే డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణం ఇప్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్, సకాలంలో బిల్లులు అందజేస్తోందని వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

నగరి : విజయపురం మండలం కాళికాపురం మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డికి పలువురు నివాళులర్పించారు. మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి, మాజీ మంత్రి చెంగారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన గీత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఇటీవల మండలంలోని ధర్మా చెరువు గ్రామానికి చెందిన గీత కరెంట్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, విద్యుత్ శాఖ అధికారులు శనివారం గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ శాఖ తరఫున బాధితుడు మోహన్‌కు రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. మంత్రి మాట్లాడుతూ కుటుంబ సభ్యులు అధైర్య పడవద్దన్నారు. తాను అన్ని విధాలా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ట్రాన్స్‌కో సీఎండీ, ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. మోహన్‌కి ఉద్యోగం ఇప్పించి వారి కుటుంబానికి బాసటగా నిలవాలన్నారు. పిల్లలను టీటీడీ పాఠశాలలో చదివించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణంతోపాటు వెలుగు ద్వారా ఎలాంటి రుణ సదుపాయం ఉన్నా చేయిస్తానని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, విద్యుత్ శాఖ డీఈ చిన్న రెడ్డెప్ప, కార్వేటినగరం ఏడీఈ నాగరాజు, ఏఈ రామాంజనేయులు, వీఆర్‌ఓ క్రిష్ణయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆలయాలకు 'నూతన' శోభ




ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు

- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- సుగంధ సుమాలతో విశేషాలంకరణ
- విద్యుద్దీపాలతో తీర్చిదిద్దిన స్వాగత తోరణాలు

పుత్తూరు రూరల్ : పట్టణంలోని ఆలయాలు కొత్త సంవత్సర వేడుకలకు ముస్తాబయ్యాయి. కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి, గ్రామ దేవత ఆరేటమ్మ, ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి, శ్రీకన్యకాపరమేశ్వరీ, ఆంజనేయస్వామి ఆలయాలు, షిర్డిసాయిబాబా, వీరబ్రహ్మేంద్ర స్వామి, గీతా మందిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగరి : న్యూ ఇయర్, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాలను శోభాయమానంగా ముస్తాబు చేశారు. కరియమాణిక్య స్వామి ఆలయ గోపురానికి రంగులు వేసి, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏర్పాట్లును ఆలయాల డీవైఈఓ నాగరత్నం శనివారం పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి నాడు భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. సుమారు 25వేల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు ప్రసాదాలు సిద్ధ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయాధికారి వెంకటరమణ, ప్రధాన అర్చకుడు మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే కరకంఠేశ్వర స్వామి ఆలయం, బుగ్గ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, సాయి దివ్యధామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేశమ్మ దేవాలయం సమీపంలోని హోటల్‌లో 2023 ఆకారంలో వేసిన దోసె ఆకట్టుకుంది.



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణస్వామి



విద్యుద్దీపాలంకరణలో సాయిబాబా ఆలయం

ఆలయ ముందు చలువ పందిరి



అప్పలాయగుంటలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు

వడమాలపేట : మండల పరిధిలోని టీటీడీకి అనుబంధమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నూతన సంవత్సరాది, ఏకాదశి రెండూ వరుసగా వస్తుండడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలో చలువ పందిళ్లు, రంగవల్లులు వేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తుననట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.



క్యూలు



ఆకట్టుకుంటున్న ముగ్గు

నెట్‌బాల్ క్రీడకు డీఎం పురం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో పాటు హెచ్‌ఎం

కార్వేటినగరం: రాష్ట్ర స్థాయి నెట్ బాల్ క్రీడకు డీఎం పురం విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయ తెలిపారు. పాఠశాల ఆవరణలో శనివారం రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 30న పుత్తూరు మండలంలోని గొల్లపల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడల్లో పి.హరికృష్ణ, జ్యోత్స్న, అండర్-14 విభాగంలో ధర్మతేజ, కావేరి సత్తా చాటారని, జనవరి 11 నుంచి 13 వరకు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు గ్రామంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. అనంతరం విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్న పీఈటీ తిరుమల రాజును అభినందించారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని కలిగి ఉండాలి



ఇండో అమెరికన్ శాస్త్రవేత జగదీశ్వరన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకుని, దాన్ని చేరుకోవడానికి కృషి చేయాలని ఇండో అమెరికన్ శాస్త్రవేత డాక్టర్ జగదీశ్వరన్ అన్నారు. ఆయన శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తన సోదరి ఉమాసుందరితో కలసి సందర్శించారు. సమావేశంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యం విద్యార్థుల్లో ఏర్పడినప్పుడే విద్యాభ్యాసం సులభతరంగా ఉంటుందన్నారు. సైన్సు విభాగంలో యూనివర్సిటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి ఏడాది నగదు బహుమతికి శాశ్వతనిధిని ప్రకటించారు. ఈ పథకం కింద రూ.25వేలు కళాశాల బ్యాంకు ఖాతాలో ఫిక్సిడ్ డిపాజిట్ చేయనున్నామని ప్రకటించారు. ఈ మొత్తంపై వచ్చే బ్యాంకు వడ్డీని ప్రతి సంవత్సరం కళాశాలలో బీఎస్సీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి బహుమతి రూపంలో అందిస్తామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జగదీశ్వరన్‌తోపాటు విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు ఉమాసుందరిని శాలువతో ఘనంగా సన్మానించారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



విజేతలతో కమిషనర్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నెహ్రూ యువ కేంద్రం, బెస్ట్ విలేజ్ డెవలప్‌మెంట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొత్తం 8 జట్లు తలపడగా డిగ్రీ కళాశాల బీకామ్ జట్టు ప్రథమ బహుమతిని, రోలెక్స్ జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ యువజన సేవ కార్యకర్త అత్తూరు విజయకుమార్, ఐఆర్‌డీఎస్ గోవింద స్వామి, సచివాలయ ఉద్యోగుల సంఘం నేత తిరుమలయ్య, అధ్యాపకుడు ధర్మారావు, పీడీలు ప్రేమ్ కుమార్, చంద్ర శేఖర్, యువ కేంద్ర కార్యకర్తలు దీపా, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో ముందస్తు సంబరాలు



పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తుగా నూతన సంవత్సర సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు.


రూ.15 లక్షలతో వారపు సంత కాంప్లెక్స్



శరవేగంగా నిర్మాణ పనులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలో రూ.15 లక్షలతో వారపు సంత కాంప్లెక్సు నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక సర్పంచ్ శిల్ప, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య తెలిపారు. ఇక్కడ ప్రతి మంగళవారం జరిగే వారపు సంత రోడ్డుపై నిర్వహించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షానికి, ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నిధులతో సర్పంచ్ ఆధ్వర్యంలో కాంప్లెక్సు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



బాబునాయుడును సత్కరిస్తున్న నాయకులు

వడమాలపేట : కల్లూరు వీఆర్‌ఓ బాబునాయుడు శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి వెంకటస్వామి, సంఘం నాయకులు ప్రభుదాస్, మునిబాబు,నాగరాజు, లోకనాథం, మస్తాన్, రాజశేఖర్, మునిశేఖర్ పాల్గొన్నారు.

మండలంలో కప్పేసిన పొగమంచు



పట్టపగలే లైట్ వేసుకుని వెళుతున్న వాహనాలు, (ఇన్‌సెట్) కమ్మేసిన పొగమంచు

పాలసముద్రం మండలంలోని అన్ని ప్రాంతాల్లో శనివారం పొగమంచు కప్పేసింది. ఉదయం రెండు రోజులుగా 8.30 గంటలైనా సూర్య కిరణాలు భూమిపై పడలేదు. లైట్ల వెలుతురులో వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మంచు మిరప, మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– పాలసముద్రం